క్లుప్తంగా

మొక్కలు నాటిన వాకర్స్ అసోసియేషన్



జాతీయ రహదారిపై మొక్కలు నాటి నీళ్లు పోస్తున్న దెందులూరు వాకర్స్

దెందులూరు: జాతీయ రహదారిపై సత్యనారాయణపురం నుంచి దెందులూరు చెక్‌పోస్టు వరకు వివిధ రకాల 50 మొక్కలు నాటామని దెందులూరు వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు సుగ్గిశెట్టి నూకరాజు అన్నారు. శనివారం నాటిన మొక్కలకు సభ్యులు నీళ్ల పోశారు. ప్రతి గ్రామంలో, ప్రతి వ్యక్తి ఒక మొక్క నాటాలని దెందులూరు వాకర్స్ అసోసియేషన్ తరపున ప్రచారం నిర్వహిస్తున్నామన్నారు.

పింఛన్లపై విచారణ ప్రారంభం

దెందులూరు: ఏలూరు జిల్లా దెందులూరు మండల పరిధిలోని అక్రమ పింఛన్లపై విచారణ ప్రారంభమైందని ఎంపీడీఓ వి.శ్రీలత అన్నారు. శనివారం ఎంపీడీఓ కార్యాలయంలో ఆమె మాట్లాడుతూ భర్త ఉన్నప్పటికీ లేనట్టు సర్టిఫికెట్, వైకల్యం లేకపోయినా ఉన్నట్టు సర్టిఫికెట్, వయసు లేకపోయినా ఆధార్ కార్డు మార్చి సర్టిఫికెట్లు తీసుకుని అక్రమంగా పింఛన్లు పొందుతున్నవారి జాబితా సిద్ధం చేయాలని ముఖ్యమంత్రి ఆదేశాలకు అనుగుణంగా వెల్ఫేర్ అసిస్టెంట్, గ్రామ కార్యదర్శులతో గ్రామాల్లో విచారణ ప్రారంభించామన్నారు. అన్ని గ్రామాల్లో పింఛన్లపై విచారణను పర్యవేక్షిస్తానని ఆమె తెలిపారు.

దెందులూరులో పారిశుద్ధ్య పనులు



దెందులూరులో ఎస్ఎంఆర్ నగర్ వద్ద చెత్త తొలగిస్తున్న దృశ్యం

దెందులూరు: పారిశుద్ధ్య పనుల స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా శనివారం ఎస్ఎంఆర్ నగర్ వద్ద రోడ్డు కిరువైపులా పేరుకుపోయిన చెత్తను గ్రామ కార్యదర్శి వి.శ్రీనివాసచౌదరి పర్యవేక్షణలో పారిశుద్ధ్య కార్మికులు ట్రాక్టర్లపై తరలించారు. అనంతరం బ్లీచింగ్ చల్లించారు. డ్రెయిన్‌లో పూడికతీత తీయించి ఇరువైపులా మొక్కలను నాటించారు. పనులను ఎంపీడీఓ వీ.శ్రీలత, సర్పంచ్ తోట ఏసమ్మ పరిశీలించారు.

పాఠశాలల తనిఖీ



కొమిరేపల్లిలో పాఠశాలను తనిఖీ చేస్తున్న ఎంఈఓ ఏవీఎన్‌వీ ప్రసాద్

దెందులూరు: కొమిరేపల్లి ప్రాథమిక పాఠశాలను దెందులూరు మండల విద్యాశాఖాధికారి ఏవీఎన్‌వీ ప్రసాద్ శనివారం తనిఖీ చేశారు. రికార్డులు విద్యార్థుల సంఖ్య, పాఠశాల గ్రౌండ్, మధ్యాహ్న భోజనం, విద్యుత్, టాయిలెట్లు పరిశీలించి పాఠశాల నిర్వహణపై సంతృప్తి వ్యక్తం చేశారు. హెచ్ఎం, ఉపాధ్యాయులను ఆయన అభినందించారు.

పుస్తక పఠనంతో ప్రపంచ జ్ఞానం



పెదవేగిలో పుస్తకాలు అందజేస్తున్న డీఎస్పీ లక్ష్మయ్య, పెదవేగి సీఐ శ్రీనివాస్

దెందులూరు: పుస్తక పఠనం మానవ సంబంధాల విలువ, జీవన విధానం, ప్రపంచ జ్ఞానాన్ని తెలియజేస్తుందని నూజివీడు డీఎస్పీ జి. లక్ష్మయ్య అన్నారు. శనివారం పెదవేగి పోలీస్‌స్టేషన్‌లో జీవిత సత్యాలు, జనరల్ నాలెజ్ పుస్తకాలను యువతకు ఆయనకు అందజేశారు.

డ్యూటీ సర్టిఫికెట్లు ఇప్పించాలి

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఇటీవల జరిగిన ఎన్నికల్లో పీఓ, ఏపీఓ, ఓపీఓలుగా విధులు నిర్వహించిన సిబ్బందికి డ్యూటీ సర్టిఫికెట్లు, ఎన్నికల తరువాత మూడో రోజుకు కూడా డీఏ ఇవ్వాలని ఏపీటీఎఫ్ నాయకులు జిల్లా కలెక్టర్ వెట్రి సెల్విని కోరారు. వారు శనివారం కలెక్టర్ వెట్రిసెల్విని మర్యాద పూర్వకంగా కలుసుకుని పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. జిల్లాలో విద్యారంగ అభివృద్ధికి ఉపాధ్యాయులు కూడా తమ వంతు కృషి చేయాలని కలెక్టర్ సూచించారని నాయకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి బీఏ సాల్మన్ రాజు, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు టి.రామారావు, బి.రెడ్డి దొర, ఉపాధ్యక్షుడు ఎస్ దొరబాబు తదితరులు పాల్గొన్నారు.

రేషన్‌లో పంచదార కోత

- మొదటి నెలలోనే పేదలపై కూటమి ప్రభుత్వం ప్రతాపం
- అరకొరగా పౌరసరఫరా సరుకుల పంపిణీ



పంచదార

మండలం	రేషన్ లబ్ధిదారులు
దెందులూరు	22,036
పెదపాడు	21,478
పెదవేగి	29,868
ఏలూరు రూరల్	85,366

దెందులూరు: కూటమి ప్రభుత్వం పేదలకు సరఫరా చేసే పౌర సరఫరాల్లో ఒకటైన పంచదార ఇవ్వలేదు. ప్రభుత్వం ఏర్పడిన మొదటి నెలలోనే పంచదార ఇవ్వకపోవడంతో వినియోగదారులు, మహిళలు నివ్వెరపోతున్నారు. ఎన్నికలకు ముందు పేదలకు మెరుగైన పాలన అందిస్తాం. గత ప్రభుత్వం కంటే మెరుగైన సేవలందిస్తారని వాగ్దానాలు ఇచ్చిన హామీలు పూర్తిస్థాయిలో నెరవేరలేదు. ప్రతి వ్యక్తికి దైనందిక జీవితంలో పంచదార వినియోగం చాలా ముఖ్యమైంది. పేదలకు గత ప్రభుత్వం ఎప్పుడూ కొరత లేకుండా వాహనాల ద్వారా ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అందించే సరుకులను ఇచ్చేవారు. ప్రతి నెల 1వ తేదీ నుంచి 16వ తేదీ వరకు ప్రభుత్వం తెల్లకార్డు వినియోగదారులకు రేషన్ సరుకులను అందిస్తోంది. ఇందుకు భిన్నంగా మొదటి నెలలో పంచదార సరఫరా కాకపోవడం గమనార్హం. ప్రభుత్వం తెల్లకార్డుల వినియోగదారులకు పంపిణీ చేసే పంచదార ఈ నెల సరఫరా కాలేదని మాధవరావు, డిప్యూటీ తహసీల్దార్ (సివిల్ సప్లయ్స్) అన్నారు. సరుకుల పంపిణీపై ప్రభుత్వం నుంచి తదుపరి ఆదేశాలు వచ్చిన తరువాత వినియోగదారులకు తెలియజేస్తామని ఆయన అన్నారు.

పంచదార నిలుపుదల చేస్తే ఎలా?



రేషన్ సరుకుల్లో పంచదార ఇవ్వకపోవడం ఏమిటి? గృహవినియోగంలో పంచదార ముఖ్యమైంది. ఎందుకు ఇలా జరిగిందో అధికార యంత్రాంగం నుంచి సమాచారం లేదు.

– గొరిపర్తి వరలక్ష్మి, ఎంపీటీసీ, కొవ్వలి

పంపిణీ తేదీ ప్రకటించాలి



ఈ నెల ఇవ్వని పంచదార మళ్లీ ఎప్పుడు ఇస్తారో ప్రభుత్వం, అధికారులు స్పష్టం చేయాలి. ఖచ్చితంగా ఇచ్చే తేదీని ప్రకటించాలి.

– నిట్టా లీలానవకాంతం గంగరాజు, జెడ్పీటీసీ

సరుకుల కోత బాధాకరం



రాష్ట్ర ప్రభుత్వం పేదలకు అందించే రేషన్ సరుకుల విషయంలో పంచదార ఇవ్వకపోవడం బాధాకరం. పేదలకు రేషన్ సరుకులు అందించేది ఇలాగేనా? మొదటి నెలలోనే ఇలా చేస్తే వేలాది మంది వినియోగదారులు వారి అవసరాల పరిస్థితి ఏమిటి.

– తేరా ఆనంద్, వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు

ఎరువుల దుకాణాల్లో విజిలెన్స్ తనిఖీ



భీమడోలులో ఎరువుల దుకాణంలో స్టాక్ రిజిస్టర్‌ను పరిశీలిస్తున్న అధికారులు



ఎరువుల దుకాణంలో తనిఖీ నిర్వహిస్తున్న అధికారులు

భీమడోలు: భీమడోలులోని మన గ్రోమోర్ ఎరువులు, పురుగు మందుల దుకాణంపై శనివారం విజిలెన్స్ అధికారులు ఆకస్మిక తనిఖీ చేశారు. విజిలెన్స్ సీఐ యుజే విల్సన్, భీమునిపట్నం ఏడీఏ బి.విజయప్రసాద్ ఆధ్వర్యంలో సంబంధిత అధికారుల బృందం విజిలెన్స్ తనిఖీలు చేశారు. స్టాక్ రిజిస్టర్లు సక్రమంగా నిర్వహించని కారణంగా రూ.25.21 లక్షల విలువ చేసే ఎరువుల అమ్మకాలను నిలిపివేశారు. దుకాణంలో ఎరువులు, పురుగు మందుల విక్రయాలపై సరైన పత్రాలు ఉన్నదీ లేనిదీ క్షుణ్ణంగా పరిశీలించారు. సరుకు బిల్లులు, రికార్డులు, స్టాక్ రిజిష్టర్లు, సరుకు నిల్వ తదితర అంశాలను పరిశీలించారు. స్టాక్ రిజిస్టర్లలో స్టాక్ వివరాలను సక్రమంగా నిర్వహించలేదు. దీనితో దుకాణంలోని రూ.25.21లక్షల విలువ గల 187.80 మెట్రిక్ టన్నుల ఎరువుల అమ్మకాలను నిలుపుదల చేశారు. ఎప్పటికప్పుడు సరుకు వివరాలను తాజా పర్చుకోవాలని దుకాణం యాజమానికి సూచించారు. అప్పటి వరకు స్వాధీనం చేసుకుని వాటిపై నిఘా ఉంచాలని వ్యవసాయాధికారులు ఆదేశించారు. విజిలెన్స్ అధికారులతో పాటు భీమడోలు ఏడీఏ పి.ఉషారాజకుమారి, ఏవో ఎస్‌పీవీ ఉషారాణి, సిబ్బంది ఉన్నారు. విజిలెన్స్ బృందాలు ఆకస్మిక తనిఖీలు చేస్తున్నాయన్న సమాచారం అందుకున్న భీమడోలు, పోలసానిపల్లి గ్రామాలు తదితర ప్రాంతాల్లోని దుకాణందారులు షాపులను మూసేసారు.

రూ. 31లక్షల ఎరువులు సీజ్

ఉంగుటూరు: విజిలెన్స్ అధికారులు శనివారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఉంగుటూరు, భీమడోలు, ద్వారకాతిరుమల మండలాల్లోని ఎరువులు, పురుగు మందులు, విత్తనాల షాపులను తనిఖీ చేశారు. గోద్రేజ్ ఆగ్రోవెట్‌ను తనిఖీ చేసి రూ.31.15లక్షల విలువైన ఎరువులను సీజ్ చేసి, కేసు నమోదు చేశారు. ఈ దాడుల్లో సీ అండ్ డీపీ ఏడీఏ విజయప్రసాద్, విజిలెన్స్ సీఐ విల్సన్, భీమడోలు ఏడీఏ పి.ఉషా రాజకుమారి, ఎంఏవో బి.వెంకటేష్, గొల్లగూడెం వీఆర్‌వో పాల్గొన్నారు.

బాబూ జగ్జీవన్‌రామ్ భారతావనికి మార్గదర్శకులు



నడిపల్లిలో జగ్జీవన్‌రామ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం

దెందులూరు: భారత మాజీ ఉపప్రధాని, కేంద్ర మంత్రి, ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా ఏర్పాటుకు ప్రధాన కారకుడుగా భారతదేశానికి డాక్టర్ బాబు జగ్జీవన్‌రామ్ అందించిన సేవలు ఆదర్శనీయమని జగ్జీవన్‌రామ్ యువత అధ్యక్షుడు జిజ్జువరపు సురేష్ అన్నారు. శనివారం నడిపల్లిలో జగ్జీవన్‌రామ్ వర్థంతి వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గొల్లపల్లి ప్రసాద్, రాజేష్, కాంతారావు, గోపాలరావు, శ్రీను నివాళులర్పించారు.

నాగులదేవునిపాడులో గాలాయగూడెం సర్పంచ్ చిలకా వెంకట సుబ్బారావు ఆధ్వర్యంలో వర్థంతి సందర్భంగా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. భారతదేశంలో ఆహార సమస్య రాకుండా ఫుడ్ కార్పొరేషన్ వ్యవస్థను ఏర్పాటు చేసిన మహానీయుడన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు మెంబర్లు శ్రీధర్, రాజేష్, వైఎస్సార్ సీపీ నాయకులు ఉన్నారు.

శునకాలకు రేబిస్ నిరోధక టీకాలు



కుక్కలకు వ్యాధి నిరోధక టీకా వేస్తున్న పశువైద్యాధికారి కె.రామ్మోహనరావు



భీమడోలులో శునకానికి వ్యాక్సిన్ వేస్తున్న ఏడీ ఇక్కుర్తి సాయిరమేష్, వైద్యులు హరికృష్ణ

దెందులూరు: ప్రపంచ జూనోసిస్ దినోత్సవంలో భాగంగా కుక్కలకు వ్యాధి నిరోధక టీకాలు వేసినట్టు మండల పశువైద్యాధికారి డాక్టర్ రామ్మోహనరావు అన్నారు. శనివారం కొవ్వలితో పాటు పలు గ్రామాల్లో కుక్కలకు వ్యాధి నిరోధక టీకాలను వేశారు. ఏటా జూలై 6న కుక్కలకు వ్యాధి నిరోధక టీకా వేస్తున్నట్లు తెలిపారు.

శునకాలకు రేబిస్ నిరోధక వ్యాక్సినేషన్

భీమడోలు: జూనోసిస్ డేను పురస్కరించుకుని భీమడోలు పశుసంవర్ధక శాఖ సహాయ సంచాలకుల ఆసుపత్రి వద్ద శనివారం శునకాలకు ఉచిత రేబిస్ వ్యాక్సిన్ వేశారు. భీమడోలు, ద్వారకాతిరుమల, ఉంగుటూరు, నిడమర్రు మండలాల్లోని 2,244 శునకాలకు టీకాలు వేసే ప్రక్రియను చేపట్టారు. భీమడోలు సహాయ సంచాలకులు డాక్టర్ ఇక్కుర్తి సాయి రమేష్ శునకాలకు ఉచితంగా టీకాలు వేసి యాజమానులకు పలు సూచనలు చేశారు. అనంతరం సాయిరమేష్ మాట్లాడుతూ భీమడోలు సహాయ సంచాలకుల ఆసుపత్రి పరిధిలోని పశువైద్యశాలలు, రూరల్ లైవ్ స్టాక్ పాయింట్లు వద్ద గ్రామ సహాయకులు, ఆసుపత్రి సిబ్బంది దద్వారా టీకాలు వేశామన్నారు. ఈనెల 8వ తేదీ సోమవారం ఆసుపత్రుల వద్ద ప్రత్యేక శిబిరాలను ఏర్పాటు చేసి జంతువులకు వైద్య సేవలు అందిస్తున్నామన్నారు. భీమడోలులో 72 శునకాలకు టీకాలు వేశామన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యులు హరికృష్ణ, ఎల్ఎస్ఏ శ్రీహరికృష్ణ, డీఈవో చలపతిరావు, హెచ్ఏ కృష్ణ, ఏహెచ్ఏ లక్ష్మీ, ట్రైనీ సిబ్బంది పాల్గొన్నారు.

పెంపుడు కుక్కలకు రేబిస్ వ్యాక్సిన్



కుక్కలకు రేబిస్ వ్యాక్సిన్ వేస్తున్న వైద్యులు

పెదపాడు : పెంపుడు కుక్కలకు తప్పనిసరిగా టీకాలు వేయించాలని పెదపాడు మాజీ జెడ్పీటీసీ గారపాటి రామసీత తెలిపారు. ప్రపంచ జూనోసిస్ డే సందర్భంగా మండలంలోని పశు వైద్యశాలల్లో కుక్కలకు రేబిస్ వ్యాక్సిన్ అందించారు. మాజీ ఎంపీపీ మోరు శ్రావణి, బొప్పిడి కాశీబాబు, గుత్తా అనీల్, లావేటి శ్రీనివాసరావు, డాక్టరు వాణీ సంధ్య జేవీవో ఎం ఫణికుమార్, ఎల్ఎస్ఏలు కే శ్రీదేవి, జయప్రకాష్, ఎండీ ఇర్ఫాన్, అసిస్టెంట్‌హెల్త్ అసిస్టెంటట్లు పాల్గొన్నారు.

కుక్కలకు యాంటీ రేబిస్ వ్యాక్సిన్

ఉంగుటూరు: ఉంగుటూరు పశు వైద్యశాలలో జూనోసిస్‌డేను శనివారం నిర్వహించారు. పశు వైద్యాధికారులు శిరీష ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పెంపుడు జంతువులకు రేబిస్ వ్యాక్సిన్‌ను అందజేశారు.కార్యక్రమంలో పెంపుడు కుక్కలకు యాంటీ రేబిస్ వ్యాక్సిన్ వేశారు. సర్పంచ్ సింధు మధుబాబు, వెటర్నరీ లైవ్ స్టాక్ అధికారి మల్లిపూడి చినబాబూరావు, ప్రసన్న, రత్నకుమార్, ప్రేమ్, సునీత, రవి, దుర్గాప్రసాద్, విజయ్, రైతులు, పశువుల పెంపకందార్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా విద్యార్థి ఎన్నికలు



రాచూరు హైస్కూల్లో ఓటు వేస్తున్న విద్యార్థినులు

ఉంగుటూరు: రాచూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థి ఎన్నికలు శనివారం ఉత్సాహంగా నిర్వహించారు. సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయిని బీవీఎస్ఎల్ అరుణాదేవి ఎన్నికల అధికారిగా వ్యవహరించి, ప్రజాస్వామ్యయుతంగా ఎన్నికలు నిర్వహించారు. సీక్రెట్ బ్యాలెట్ పేపర్ విధానంలో సాధారణ ఎన్నికలు నిర్వహించే తీరులో ఈకార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులు ఎన్నికల అధికారులుగా, ఏజెంట్లుగా విధులు నిర్వర్తించారు. సుమారు 150 మంది విద్యార్థులు ఓటింగ్‌లో పాల్గొనగా, పాఠశాల ఎస్‌పీఎల్‌గా 54 ఓట్లతో 9వ తరగతి విద్యార్థి పాగిరి నాగచైతన్య ఎన్నికయ్యాడు. 31 ఓట్లు సాధించి ఏఎస్‌పీఎల్‌గా చిల్లా మిన్ని ఎంపికైంది. బాలికా ప్రతినిధిగా 22 ఓట్లతో 8వ తరగతి విద్యార్థిని జె.మౌనిక ఎంపిక కాగా, 20 ఓట్లు సాధించి పి.పూర్ణ సత్య ద్వితీయ సాధించినట్లు తెలిపారు. ఎన్నికల అనంతరం హెచ్ఎం విజయ్‌కుమార్ విద్యార్థులతో ప్రమాణ స్వీకారం చేయించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు వి.శ్రీనివాస్, ఎస్.సాయిరామ్, రత్నకుమార్, శ్రీకాంత్, వెంకటేశ్వరరావు, జహనీ, లక్ష్మీజ్యోతి పాల్గొన్నారు.

కౌలు రైతులకు సీసీఆర్‌సీ కార్డులు



వట్లూరులో కౌలు రైతులతో మాట్లాడుతున్న వ్యవసాయ అధికారి ప్రదీప్‌కుమార్

పెదపాడు: కౌలు రైతులు సీసీఆర్‌సీ కార్డులు పొందాలని పెదపాడు మండల వ్యవసాయ అధికారి వానపల్లి ప్రదీప్‌కుమార్ తెలిపారు. పెదపాడు మండలంలోని వట్లూరులో కౌలు రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ కౌలు రైతులు సీసీఆర్‌సీ కార్డులు ఉంటే ప్రభుత్వం నుంచి లభించే రాయితీలు, పలు పథకాల లబ్ధి పొందవచ్చునని చెప్పారు. ఈ కార్యక్రమంలో గ్రామ రెవెన్యూ అధికారి రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

వ్యాధులు, ప్రకృతి వైపరీత్యాలపై అప్రమత్తం

పెదపాడు: అధికారులంతా అప్రమత్తతతో వ్యవహరించాలని పెదపాడు తహసీల్దార్ వి భావన్నారాయణ తెలిపారు. తహసీల్దార్ కార్యాలయంలో అధికారులతో శనివారం ఆయన సమావేశం నిర్వహించారు. వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని తహసీల్దార్ సూచించారు. ప్రకృతి వైపరీత్యాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పలు సూచనలు చేశారు.

హెల్మెట్ ధారణతో ప్రాణ రక్షణ

ఏలూరు (టూటౌన్): వాహన ప్రమాదాల నివారణకు ద్విచక్రవాహన చోదకులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని పర్మినెంట్ లోక్‌అదాలత్ చైర్ పర్సన్ ఎ.మేరీగ్రేస్ కుమారి సూచించారు. రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థ ఆదేశాల మేరకు ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ప్రధాన న్యాయమూర్తి సి.పురుషోత్తంకుమార్ ఆధ్వర్యంలో జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్నప్రసాద్ అధ్యక్షతన శనివారం వాహన ప్రమాదాలు నివారణ అనే అంశంపై అవగాహన కార్యక్రమం స్థానిక జిల్లా న్యాయసేవాధికార సంస్థ భవన్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా మేరీ గ్రేస్ కుమారి మాట్లాడుతూ హెల్మెట్ ధరించడం వల్ల ప్రాణ నష్టాన్ని నివారించవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు సీనియర్ సివిల్ జడ్జి కేకేవీ బులికృష్ణ, న్యాయవాదులు, వాహనచోదకులు పాల్గొన్నారు.

బిషప్ జయరావు సేవలు చిరస్మరణీయం

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఏలూరు మేత్రాసనం పీఠాధిపతి బిషప్ పొలిమేర జయరావు సేవలు చిరస్మరణీయమని గాంధీ కోఆపరేటివ్ బ్యాంక్ డైరెక్టర్ కల్లె నాగేశ్వరరావు అన్నారు. శనివారం స్థానిక గ్జేవియర్ నగర్లోని బిషప్ హౌస్‌లో బిషప్ జయరావును ఆయన మర్యాద పూర్వకంగా కలిశారు. ఏలూరు బిషప్‌గా బాధ్యతలు స్వీకరించిన నాటి నుంచి జయరావు పేద వర్గాలను ఆదుకోవడానికి అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని తెలిపారు. కరోనా విపత్కర పరిస్థితుల్లో, అలాగే వరదలు, అగ్ని ప్రమాదాలు వంటి ఆపద సమయాల్లో బాధితులను అక్కున చేర్చుకుని వారికి అండగా ఉన్నారని గుర్తుచేశారు. బిషప్ సేవలు మరింత కాలం కొనసాగాలని ఆకాంక్ష వ్యక్తం చేశారు.

డయేరియాపై అవగాహన కల్పించాలి



ఎంఎంపురంలో క్లోరినేషన్‌పై సిబ్బంది అవగాహన కల్పిస్తున్న ఈవోఆర్‌డీ సుందరి



కొమిరేపల్లిలో వైద్య సిబ్బంది, గ్రామస్తుల మానవహారం

భీమడోలు: డయేరియాపై ప్రజలందరికీ అవగాహన కల్పించాల్సిన బాధ్యత మనందరిపై ఉందని మండల పంచాయతీరాజ్ విస్తరణాధికారి ఏ.సుందరి అన్నారు. పూళ్ల, కోడూరుపాడు, దుద్దేపూడిలో శనివారం స్టాక్ డయేరియా కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ వెళ్లి డయేరియా వ్యాధి రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించి కరపత్రాలను ఆవిష్కరించారు. గ్రామాల్లో చేపట్టిన పారిశుద్ధ్య కార్యక్రమాలను పరిశీలించిన ఆమె కార్యదర్శులకు పలు సూచనలందించారు. మంచినీటి ట్యాంకుల పరిశుభ్రత, వాటర్ క్లోరినేషన్, పైపులైన్లను, అంగన్‌వాడీ కేంద్రాలను పరిశీలించారు. పైపులైన్లు లీకేజీలకు తక్షణమే మరమ్మతులు చేపట్టాలని కోరారు. అంగన్‌వాడీ కేంద్రాల్లోని చిన్నారులకు విధిగా రక్షిత నీటిని, వేడి ఆహార పదార్థాలను వారికి అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

స్టాప్ డయేరియా కార్యక్రమం

ఉంగుటూరు: స్టాప్ డయేరియా కార్యక్రమాన్ని శనివారం ఉంగుటూరులో నిర్వహించారు. సర్పంచ్ బండారు సింధు అధ్యక్షతన నిర్వహించిన గ్రామ సభలో యాక్షన్ ప్లాన్, అజెండాను కార్యదర్శి వివరించారు. కార్యక్రమంలో వైద్యాధికారులు, ప్రజల సూచనలు సలహాలు తీసుకున్నారు. పాతూరి విజయ్ కుమార్ మాట్లాడుతూ వ్యాధుల వ్యాప్తి- తీసుకువాల్సిన జాగ్రత్తలు వివరించారు. ఉపసర్పంచ్ పాతూరి శ్రీ జనార్దన్, కార్యదర్శి, ఇన్‌ఛార్జ్ ఈవోపీఆర్‌డీ గిరిధర్ మాట్లాడుతూ గ్రామంలో కాలువగట్ల వెంబడి చెత్త వెయకుండా చర్యలు తీసుకున్నామని, నూతనంగా ఏర్పాటు చేసిన డంపింగ్ యార్డ్ స్థలంలో మాత్రమే చెత్త వేస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది, ఆశ వర్కర్స్, అంగన్‌వాడీ సిబ్బంది, సచివాలయ సిబ్బంది, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

డయేరియాపై అవగాహన ర్యాలీ

దెందులూరు: ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రత, సామూహిక పరిశుభ్రత, పాటించకపోతే వివిధ రకాల వ్యాధుల బారినపడే ప్రమాదం ఉందని సీతంపేట సర్పంచ్ పరసా లక్ష్మీసుజాత అన్నారు. శనివారం కొమిరేపల్లిలో గ్రామస్తులు, వైద్యసిబ్బంది, విద్యార్థులు మానవహారం నిర్వహించి వ్యాధుల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. డయేరియా వివిధ వ్యాధులపై ఎంఈఓ ఏవీఎన్‌వీప్రసాద్, ఎంపీడీఓ వీ.శ్రీలత అవగాహన కల్పించారు.

అభివృద్ధి పనులపై సమీక్ష



పెదవేగి మండల సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్

దెందులూరు: ప్రతి గ్రామ శివారు ప్రాంతాల్లో ప్రభుత్వ పథకాల అమలులో ఎంపికలో ఎటువంటి అవకతవకలకు ఉద్యోగులు, అధికారులు తావు ఇవ్వరాదని ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అన్నారు. శనివారం పెదవేగి ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ తాతా రమ్యశ్రీ కుమార్ అధ్యక్షతన పెదవేగి మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఎంపీపీ తాతా రమ్యశ్రీ కుమార్ మాట్లాడుతూ అన్ని శాఖల అధికారులు, ఉద్యోగులు సమష్టి కృషితో సేవలందించాలన్నారు. ఎమ్మెల్యే ప్రభాకర్ అభివృద్ధి పనులపై సమీక్ష నిర్వహించారు. జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ పెనుమాల విజయ్‌బాబు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు అధికారులు పాల్గొన్నారు.

శ్రీవారి నిత్యాన్నదాన ట్రస్టుకు రూ.లక్ష విరాళం

ద్వారకాతిరుమల: శ్రీవారి నిత్యాన్నదాన ట్రస్టుకు ఒక భక్తుడు శనివారం రూ.1,01,116 విరాళంగా అందజేశారు. ఏలూరులోని పోణంగికి చెందిన పి.ప్రసాదరావు ముందుగా కుటుంబ సభ్యులతో కలసి స్వామి, అమ్మవార్లను దర్శించారు. ఈ విరాళాన్ని ఆలయ కార్యాలయంలో జమచేశారు. ఈ సందర్భంగా దాతకు ఆలయ సూపరింటెండెంట్ జి.సుబ్రహ్మణ్యం విరాళం బాండ్ పత్రాన్ని అందించారు.